## పోలియో రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం



వివరాలు మెయిన్‌లో...

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 29 జూన్, 2026 | పేజీలు : 08

# వరద కాలువ నీటి కోసం మహాధర్నా

### నీరు విడుదల చేయకపోతే నిరసన తప్పదు

### ప్రభుత్వాన్ని హెచ్చరించిన ఎమ్మెల్యే గంగుల





**ప్రజాపక్షం / కొత్తపల్లి :** వరద కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి మహాధర్నా నిర్వహించారు. నాగులమల్యాల శివారులోని ఆచంపల్లి వరద కాలువ ఒటిస్లూయిస్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ గత పదేళ్లుగా కళకళలాడిన గొలుసుకట్టు చెరువులు కాంగ్రెస్ పాలనలో మళ్లీ ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మేడిగడ్డ నుంచి సమయానికి సాగునీటిని విడుదల చేయకపోవడంతో కరీంనగర్ నియోజకర్గంలోని చెరువులు, కుంటలు నీరులేక వెలవెలబోతున్నాయని అన్నారు. మేడిగడ్డ నుంచి ప్రస్తుతం వేలాది క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తున్నప్పటికీ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదన్నారు. గతంలో ఆంధ్రా పాలకులు తెలంగాణ నీటి వనరులను వినియోగించుకున్నారే తప్ప ఈ ప్రాంత రైతులకు సాగు నీరు అందించాలనే ఆలోచన చేయలేదన్నారు. రైతుల కష్టాలను గుర్తించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ స్వరాష్ట్రం సాధించిన అనంతరం రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని అన్నారు. రాష్ట్రానికి అవసరమైన నీరు, విద్యుత్‌తోపాటు రైతు బంధు వంటి పథకాల ద్వారా రైతులకు అండగా నిలిచారని తెలిపారు. కాళేశ్వరం మోటార్లు నడిపితే కేసీఆర్‌కు పేరు వస్తుందనే రాజకీయ కారణాలతో కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి విడుదలను నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. 2009లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత కొత్తపల్లి ప్రాంత పరిస్థితిని చూసి చలించిపోయానని అనంతరం పెద్దఎత్తున నిధులు తీసుకొచ్చి రోడ్లు, చెరువులు, కుంటలను అభివృద్ధి చేశానని అన్నారు. కొత్తపల్లి మండలంలోని 7 గ్రామాలకు సాగునీరు అందించేందుకు వరద కాలువ నుంచి నాగులమల్యాల చెరువుకు నీరు చేరేలా తూము ఏర్పాటు చేయించినట్లు పేర్కొన్నారు. తూము ఏర్పాటుకు వారి భూములను ఇచ్చి సహకరించిన రైతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఎమ్మెల్యే గంగుల. వారం రోజుల్లోగా ప్రభుత్వం స్పందించి తూము ద్వారా నీటిని విడుదల చేయాలని లేనిపక్షంలో వరద కాలువలో భారీ మోటార్లు ఏర్పాటు చేసి రైతులకు నీరు అందిస్తామని హెచ్చరించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీష్ రావు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, రైతులతో కలిసి కన్నెపల్లి వరకు పాదయాత్ర నిర్వహించి మోటార్లు ఆన్ చేసి రైతులకు నీరు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన సుమారు వెయ్యి మంది రైతులతోపాటు ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాజకీయాలు ఎన్నికల వరకే
## అభివృద్ధి నిరంతర ప్రక్రియ



### జగిత్యాల డా.ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/రాయికల్ :** రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితమని అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని రాయికల్ మార్కెట్ అభివృద్ధికి తనవంతు కృషి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం రాయికల్ పట్టణ మార్కెట్ వాడలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాదిగ సంఘం కమాన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూమాదిగ కుంట ను కొంతమంది చట్టం లో లొసుగులను చూపి దోమల కుంట గా మార్చారని అన్నారు. అంబేద్కర్ సంఘం అభివృద్ధి కి కృషి చేస్తానని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు తో పేదల సొంతింటి కల సాకారం అవుతుందన్నారు.రాయికల్ డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పూర్తి కి కృషి చేస్తానని తెలిపారు.రాయికల్ పట్టణ అభివృద్ధి కి అత్యధిక నిధులు మంజూరు చేశానని రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితమని అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని అన్నారు. అమృత్ స్కీమ్ లో 16లక్షల లీటర్ల ట్యాంక్ నిర్మాణం తోతాగు నీటి కొరత లేకుండా రాయికల్ పట్టణం ఉండబోతుందని అన్నారు.అనంతరం ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షున్ని అంబేద్కర్ సంఘం సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజేంగి నందయ్య,ఆత్మ చైర్మెన్ కాటిపెల్లి గంగారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు మచ్చ గంగలక్ష్మి ,పల్లికొండ గంగాధర్,మాజీ మున్సిపల్ ఛైర్మన్ మోర హన్మండ్లు,పాక్స్ చైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి,మాజీ ఎఎంసి చైర్మెన్ లు రాణి సాయి,గన్నె రాజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవీందర్ రావు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు లింగంపల్లి సుభాష్, ఉపాధ్యక్షులు మారంపల్లి లక్ష్మి నరసయ్య, ప్రధాన కార్యదర్శి దోనకంటి రాజేందర్,కోశాధికారి లింగంపల్లి భూమయ్య,సహ కార్యదర్శులు గంగాధర్, హనుమాన్లు,న్యాయవాదులు లింగంపల్లి సురేష్,అల్లే పురుషోత్తం,మచ్చ శేఖర్,నాయకులు బాపురపు నర్సయ్య,కోల శ్రీనివాస్,మ్యకల కాంతారావు,మహేంద్ర బాబు,పాక్స్ వైస్ చైర్మెన్ మోహన్ రెడ్డి,సర్పంచుల ఫోరం మోహన్,అచ్యుత్ రావు, పడిగెల నరసింహ,కొత్తపెల్లి అరవింద్,సురేష్, భీమన్న,శ్రీనివాస్,సర్పంచులు, అంబేద్కర్ సంఘం సభ్యులు,నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా వర్షం.. రైతన్నల్లో హర్షాతిరేకాలు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గ కొన్ని రోజులుగా ఎండ తీవ్రత తో అల్లాడుతున్న జనం వర్షం రాకతో ఒక్కసారిగా ఉపశమనం పొందారు. సాయం త్రం వేళ వాతావరణం పూర్తిగా చల్లబడటంతో మండల ప్రజ లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమై 15రోజులు గడుస్తున్నా వర్షాలు కురవకపోవడంతో మండలంలో వరినాట్లు తీవ్రంగా వెనకబడ్డాయి. వానల కోసం ఆకాశం వైపు ఎదురుచూస్తున్న రైతులకు ఈ ఆదివారం నాటి వర్షం ఎంతో ఊరటనిచ్చింది. ఈ వర్షంతో సాగునీటి ఇబ్బందులు కొంత వరకు తొలగడంతో నేటి నుంచి రైతులు పూర్తి స్థాయిలో వ్యవసాయ పనుల్లో నిమగ్నం కానున్నారు. గత కొద్దిరోజులుగా వాతావరణంలో మార్పులు కనిపిస్తున్నప్పటికీ ఆదివారం మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టాయి. అయితే సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడి భారీ వర్షం పడటంతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. ఈ అకాల ఉష్ణోగ్రతల తగ్గుదల అటు ప్రజలకు, ఇటు అన్నదాతలకు పెద్ద ఉపశమనాన్ని కలిగించింది. ఈ వర్షం రాకతో మండలంలో సరికొత్త ఉత్సాహం నెలకొంది.

## నిధుల కొరత.. గ్రామాభివృద్ధి కుంటుపాటు




వివరాలు మెయిన్‌లో...

# మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

## డాక్టర్ నేరేళ్ల దామోదర్




**ప్రజాపక్షం /జమ్మికుంట:** మత సామరస్యానికి ప్రతీక మొహరం (పీరీల) పండుగ అని తెలంగాణ సంస్కృతి సాంప్రదాయలను కాపాడుకుందామని ఎన్నారై డాక్టర్ నేరేళ్ల దామోదర్ యూఎస్ఏ అన్నారు. మొహరం పండుగను పురస్కరించుకొని మడిపల్లి గ్రామ విలేకరుల ఆధ్వర్యంలో కళాకారులచే నిర్వహించిన ఆటా పాట ధూంధాం కార్యక్రమాన్ని మడిపల్లి గ్రామ బస్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని కుల మత ప్రాంత భేదాలకు అతీతంగా ప్రజలంతా సోదర భావంతో కలిసిమెలిసి జీవించాలని పిలుపునిచ్చారు. పుట్టిన ఊరుని ఇక్కడ సంస్కృతిని ఎప్పటికీ మరువలేమని మడిపల్లిలో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహరం పండుగను ఇంత ఘనంగా నిర్వహించడం సంతోషకరమని గ్రామ విలేకరులు బాధ్యతాయుతమైన జర్నలిజంతోపాటు ఇలాంటి సంస్కృతిక కార్యక్రమాలను ముందుండి నడిపించడం అభినందనీయమని అన్నారు. తాను ఈ గ్రామంలో పుట్టిన బిడ్డగా తన తల్లిదండ్రులను స్మరిస్తూ గ్రామాభివృద్ధికి కలలను ప్రోత్సహించడానికి ఎల్లప్పుడూ తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. గ్రామంలో అసాంఘీక కార్యకలాపాలను అరికట్టేందుకు సీసీ కెమెరాల ఏర్పాటుకు అయ్యే ఖర్చులు తనవంతు సగం ఖర్చు భరిస్తానని హామి ఇచ్చారు. గ్రామంలోని స్మశాన వాటిక అభివృద్ధి నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు, నిరుపేద ప్రజల వైద్యానికి తనవంతు సహాయ సహకారం అందజేస్తానని తెలిపారు. అనంతరం ఎన్నారై డా.నేరేళ్ల దామోదర్‌ను ప్రజాప్రతినిధులు, విలేకరుల బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మ్యాకమల్ల తిరుమలవెంకటేశ్, ఉప సర్పంచ్ కస్తూరి శ్రీనాథ్, ఏఎంసీ డైరెక్టర్ ఎగ్గేటి సదానందం, విలేకరులు ఒగ్గు రమేశ్, ఎండి నసీరుద్దీన్ అంబాల ప్రభాకర్ (ప్రభు), బోనగాని యాదగిరి, నేరేళ్ల రఘుపతి, గంగారపు రఘుబాబు, ఎండి అంకుశ్, అంబాల శ్రీరామ్, కళాకారులు వడ్లకొండ అనిల్, శనిగరపు బాబ్జి, తుమ్మనపల్లి రాజు, రామంచ భరత్, యాకుబ్ , దొగ్గల శ్రీధర్, మిట్టపల్లి బాలు, సంధ్య, రజిత, మంద జగన్, మారముల ప్రభు, గంగారపు రాజయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు

## మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్

**ప్రజాపక్షం/జమ్మికుంట:** ప్రతి మనిషి జీవితానికి రెండు పల్స్ పోలియో చుక్కలు ఎంతగానో ఉపకరిస్తాయని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అన్నారు. ఆదివారం జమ్మికుంట బస్టాండ్ పాత మున్సిపల్ కార్యాలయం హౌసింగ్ బోర్డు కాలనీలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 2026 సంవత్సరానికి సంబంధించిన నేషనల్ పల్స్ పోలియో కార్యక్రమం ఈరోజు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అప్పుడే పుట్టిన చంటి పిల్లల నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం అని పేర్కొన్నారు. ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్ తదితర స్థలాల్లో పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మరో రెండు మూడు రోజులపాటు ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తారని అన్నారు. గతంలో సాధారణ టీకాలు వేయించినప్పటికీ భవిష్యత్‌లో వచ్చే ప్రమాదం నుంచి పూర్తి రక్షణ కోసం ఈ అదనపు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చింతల శ్రీనివాస్, మాచర్ల రాజు, శ్రీపతి స్వర్ణలత నరేశ్, మంద రాధ, కొలుగూరి సురేశ్, చుంచు రమాదేవి, వైద్యురాలు చందన, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక రెడ్డి సంఘం నూతన కార్యవర్గం

**ప్రజాపక్షం/రామడుగు:**మండలంలోని వెదిర గ్రామ శ్రీ వినాయక రెడ్డి సంఘం నూతన పాలకవర్గాన్ని సంఘం సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం భవనంలో నిర్వహించిన ఎన్నికలలో అధ్యక్షులుగా వంగల సంతోష్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా వంచ రాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా వంచ రాంగోపాల్ రెడ్డి, రాళ్ల బండి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోతి శ్రీనివాస్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, రాళ్లబండి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా రాళ్లబండి చంద్రశేఖర్ రెడ్డి, ప్రచార కార్యదర్శిగా వంచ మధురెడ్డి, కార్యవర్గ సభ్యులుగా వంగల రమణారెడ్డి, రాళ్లబండి తిరుపతి రెడ్డి, కురుకండ్ల లచ్చిరెడ్డి, మావురం వెంకటరెడ్డి, వంచ హనుమంత రెడ్డి, వంచ అంజిరెడ్డి, వంగల రాంగోపాల్ రెడ్డిలతోపాటు పలువురిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే కరీంనగర్ ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ బిరెడ్డి ప్రేమ్‌సాగర్ రెడ్డిలతోపాటు పలువురు రెడ్డి సంఘానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగులను సంఘం పెద్దలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి జిల్లా తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు వంచ సుదర్శన్ రెడ్డి, రాళ్లబండి గోపాల్ రెడ్డి, రాళ్లబండి వెంకట్ రెడ్డి, వంచ కిష్టారెడ్డి, రాళ్లబండి శ్రీనివాస్ రెడ్డి, వంగల భూమిరెడ్డిలతోపాటుగా పలువురు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేత

**ప్రజాపక్షం/రామడుగు:**మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన గజ్జల నర్సింగ్ కొద్ది రోజులుగా తీవ్రమైన లివర్, జాండిస్ సమస్యలతో బాధపడుతున్నారు. వారి దయనీయ పరిస్థితి తెలుసుకున్న చొప్పదండి నియోజకవర్గ యువ నాయకులు వొడ్నాల యజ్ఞేశ్ వెంటనే స్పందించి తనవంతు బాధ్యతగా వొడ్నాల ప్రజాసేవా ట్రస్ట ద్వారా రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొత్తూరి చందు, జై భీమ్ యూత్ మాజీ అధ్యక్షులు గజ్జల పృథ్వీ, లింగంపల్లి ప్రేమ్ సామల రవి, గజ్జల శివ, గజ్జల తరుణ్ గజ్జల రాజేశ్ తదితరులు ఉన్నారు. సరైన సమయంలో స్పందించి ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన యజ్ఞేశ్ చొరవ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జాతీయ పల్స్ పోలియో రోగనిరోధక కార్యక్రమం

## యుపిహెచ్‌సి సాయిరాం నగర్‌లో కార్యక్రమాన్ని ప్రారంభించిన జువ్వాడి నర్సింగా రావు

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** జాతీయ పల్స్ పోలియో రోగనిరోధక కార్యక్రమాన్ని ఆదివారం మెట్‌పల్లి పట్టణంలోని యుపిహెచ్‌సిసాయిరాం నగర్ కాలనీలో జువ్వాడి నర్సింగా రావు ప్రారంభించారు. డా. అమరేశ్వర్, మండల వైద్యాధికారి డా. ఎల్లాల అంజిత్ రెడ్డి, పట్టణ వైద్యాధికారి డా. వాణి సమక్షంలో అర్హత కలిగిన చిన్నారికి తొలి రెండు చుక్కల పోలియో మందు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగా రావు మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా దేశం పోలియో రహిత హోదాను శాశ్వతంగా కొనసాగించవచ్చని అన్నారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.మండల వైద్యాధికారి డా. ఎల్లాల అంజిత్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సహకారం, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సమిష్టి కృషితో మెట్‌పల్లి మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని తెలిపారు.ఆదివారం ఏవైనా కారణాల వల్ల పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించి, సోమవారం ఇంటింటికీ వెళ్లి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయిస్తామని పేర్కొన్నారు.4వ వార్డు కౌన్సిలర్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది,ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజమే లక్ష్యం

## వైద్యాధికారి డా నరేష్



**ప్రజాపక్షం /పెగడపల్లి :** మండల వ్యాప్తంగా జాతీయ పల్స్ పోలియో నివారణ కార్యక్రమం ఆదివారం ఉత్సాహంగా సాగింది. పెగడపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ నరేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామగ్రామాన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ నరేష్ మాట్లాడుతూ మండలంలో 0 నుండి 5 సంవత్సరాల లోపు వయస్సు గల మొత్తం 4,179 మంది చిన్నారులను టార్గెట్‌గా నిర్ణయించుకోగా,మొదటి రోజు 4,031 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసి 96.45 శాతం ప్రగతిని సాధించినట్లు వెల్లడించారు.ఇందు కోసం మండల వ్యాప్తంగా 30 పోలియో బూత్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, బస్టాండ్లు మరియు ప్రయాణంలో ఉన్న వారి కోసం 1 మొబైల్ టీమ్‌ను కూడా రంగంలోకి దించినట్లు పేర్కొన్నారు. మిగిలిపోయిన చిన్నారుల కోసం రాబోయే రెండు రోజులు వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి చుక్కలు వేస్తారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సర్పంచులు ఓరుగల అరుణ శ్రీనివాస్, సంధి రాజమణి మల్లారెడ్డి, మేకల అంజమ్మ మల్లయ్య,ఎలుకటూరి రవి, కాశెట్టి వీరేశం,కుంటాల వనజ శ్రీనివాస్,చిర్రజిత రమణాకర్,ఉప్పులంచ భవాని లక్ష్మణ్, స్థానిక ప్రజాప్రతినిధులు,హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు,ఆశా కార్యకర్తలు మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొని పల్స్ పోలియోను విజయవంతం చేశారు.

# షార్ట్ సర్క్యూట్‌తో హోటల్ దగ్ధం



**ప్రజాపక్షం /పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి పట్టణం నారాయణ స్వామి నగర్‌లో ఆదివారం లక్ష్మి మెస్ హోటల్ విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ వల న అగ్ని ప్రమాదం జరిగింది. హోటల్ ముందు ఉన్న కట్టెల పందిరి, రేకుల షెడ్డు కాలింది. హోటల్‌లో సామగ్రి మంటల్లో కాలిపోయినట్లు నిర్వాహకుడు తెలిపారు. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం జరిగినట్లు హోటల్ యజమాని పరమేశ్వర్ తెలిపాడు. ఆదివారం హోటల్ బంద్ ఉడడం వల్ల ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.సమాచారం అందుకున్న పెద్దపల్లి ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు చుట్టు పక్కలకు వ్యాపించకుండా అదుపు చేశారు.

# లెవెల్-1 స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ కోచ్‌గా రాయికల్ యువకుడు

**ప్రజాపక్షం/రాయికల్ :** జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన ఆర్మూరి శితికంఠ తండ్రి: శంకర్ అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపును సాధించారు. ఆస్ట్రేలియాకు చెందిన ప్రతిష్టాత్మక క్రీడా సంస్థ 'ఆస్ట్రేలియన్ స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ అసోసియేషన్' (ASCA) నిర్వహించిన 'లెవెల్1 స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్' సర్టిఫికేషన్‌ను ఆయన విజయవంతంగా పూర్తి చేశారు. క్రీడాకారుల శారీరక దృఢత్వాన్ని పెంపొందించడం, మైదానంలో వారి అత్యుత్తమ ప్రదర్శనను మెరుగుపరిచేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో శిక్షణ ఇచ్చేందుకు ఈ కోర్సు దోహదపడుతుందని ఈ అంతర్జాతీయ గుర్తింపుతో క్లబ్ స్థాయి నుండి ప్రాంతీయ స్థాయి క్రీడాకారుల వరకు సరికొత్త మరియు ఆధునిక శిక్షణా ప్రోగ్రామ్‌లను రూపొందించే అర్హతను శితికంఠ సొంతం చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు అంతర్జాతీయ క్రీడా సంస్థ నుండి ఈ సర్టిఫికేషన్ సాధించడం పట్ల స్థానిక ప్రముఖులు, క్రీడాకారులు,స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# మెట్‌పల్లికి చెందిన వడ్లకొండ దివ్యకు ఓయు డాక్టరేట్

## అసాధారణ విద్యా ప్రస్థానం.. పరిశోధనా గ్రంథాన్ని నానమ్మకు అంకితం చేసిన దివ్య



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణానికి చెందిన వడ్లకొండ దివ్య ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ప్రతిష్ఠాత్మక పీహెచ్‌డీ (డాక్టరేట్) పట్టా సాధించి పట్టణానికి గర్వకారణంగా నిలిచారు.ప్రస్తుతం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో విస్తరణ అధికారిగా (ఈఓ) విధులు నిర్వహిస్తున్న దివ్య, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల సోషియాలజీ విభాగంలో పరిశోధన పూర్తి చేసి గురువారం డాక్టరేట్ పట్టాను అందుకున్నారు.ప్రొఫెసర్ రామ్ షెఫర్డ్ భీన వేణి పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్రంలో ఎంపిక చేసిన గ్రామీణ–పట్టణ ప్రాంతాలపై ఒక అధ్యయనం అనే సామాజిక ప్రాధాన్యత కలిగిన అంశంపై ఆమె నిర్వహించిన విస్తృత పరిశోధనకు గుర్తింపుగా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది.మెట్‌పల్లికి చెందిన కీర్తిశేషులు వడ్లకొండ గంగారం–లక్ష్మీ బాయి దంపతుల మనవరాలు, వడ్లకొండ వెంకటరావు–స్నేహలత దంపతుల ఏకైక కుమార్తె అయిన దివ్య ప్రాథమిక విద్య అనంతరం ఉన్నత విద్యాభ్యాసమంతా ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే పూర్తి చేశారు. బిఎస్‌సి అనంతరం ఎంఏ సోషియాలజీలో గోల్డ్ మెడల్ సాధించడంతో పాటు యూజీసీ–నెట్ అర్హత పొందారు. అనంతరం జేఆర్ఎఫ్ ఫెలోషిప్‌తో పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నారు.తన విజయానికి ప్రేరణగా నిలిచిన నానమ్మ దివంగత వడ్లకొండ లక్ష్మీబాయికి తన పరిశోధనా గ్రంథాన్ని అంకితం చేయడం విశేషం. కుటుంబం కోసం ఆమె చేసిన త్యాగాలు, ధైర్యం, ఆత్మవిశ్వాసమే తన వ్యక్తిత్వానికి బలమని, నానమ్మ ప్రేమ, ప్రోత్సాహం, తనపై ఉంచిన నమ్మకమే ఈ స్థాయికి తీసుకువచ్చాయని దివ్య భావోద్వేగంతో పేర్కొన్నారు.

# ఖానాపూర్ భూ వివాదం పై సమగ్ర విచారణ జరిపించాలి

## ప్రజా సంఘాల డిమాండ్




**ప్రజాపక్షం/ముత్తారం :** మంథని ప్రజాసంఘాల కార్యాలయంలో ప్రజా సంఘాల నాయకులు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్,డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్ మాట్లాడుతూ ఒక వైపు ప్రభుత్వం భూభారతి రైతులకు వరం అని గొప్పలు చెబుతుంటే, మరోవైపు మంథనిలో రెవెన్యూ అధికారులుకరెన్సీ కి దాసోహమై పేదల భూములను అక్రమ పట్టాలు చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి అని మండిపడ్డారు.మంథని మండలం మంథని రెవెన్యూ డివిజనల్ అధికారులు అండదండలతో జరిగిన మంథని మండలం ఖానాపూర్ గ్రామంలో విరసత్ అక్రమ పట్టా భూవివాదం రోజు రోజు కు ముదురుతుందని అన్నారు.వివరాల్లోకి వెళితే మంథని పరిధి బన్న చెరువు శివారు సర్వే నంబర్ 183/A/1, 183/A/2 కు సంబంధించిన వ్యవసాయ భూమి పట్టా వ్యవహారం రెవెన్యూ శాఖలో తీవ్ర కలకలం లేవనెత్తింది. రెవెన్యూ అధికారుల సహకారంతో బ్రతికున్న వ్యక్తిని రికార్డుల్లో చంపేసి తప్పుడు సర్టిఫికెట్లతో మరొక వ్యక్తికి భూమిని పట్టా చేయడం జరిగిందని.పేద కుటుంబాలకు చెందిన రైతులు ఎన్నో ఏండ్లుగా పట్టాల కోసం ఎదురుచూస్తున్న రైతులకు పట్టాలు చేయడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయలేదని చెప్పే మంథని ఎమ్మార్వో ఆర్డిఓ లు బ్రతికి ఉన్న వ్యక్తిని చంపినట్లుగా ధ్రువీకరించి వేరే వ్యక్తులకు ఎలా పట్టా చేశారని మండిపడ్డారు.కుటుంబ సభ్యుల ధ్రువీకరణ,కుల ధ్రువీకరణ ఇతర మరణ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వమంటేనే నేనే స్వయంగా ఎంక్వైరీ చేస్తానని నీతి వాక్యాలు మాట్లాడే మంథని ఎమ్మార్వో ఏకంగా అక్రమ పట్టా జరుగుతుంటే ఎలా చూస్తూ ఉన్నారని అన్నారు.ఒక పక్క మంథని మొత్తం ఖానాపూర్ భూవివాదం జరుగుతుంటే తనకేమీ తెలియనట్లుగా తన కార్యాలయంలో అందుబాటులో ఉండకుండా ఆర్డీవో కార్యాలయంలో దాక్కున్న మంథని ఎమ్మార్వో ఇంకా ఎన్ని అక్రమ పట్టాలు చేశారో బహిరంగ ప్రకటన చేయాలని అన్నారు. జిల్లా అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఇద్దరు కిందిస్థాయి రెవెన్యూ అధికారులను సస్పెండ్ చేయడమే కాకుండా ఖానాపూర్ భూవివాదంలో సమగ్ర విచారణ జరిపి పేదల భూములపై కన్నేసి బతికున్నోళ్లనే చంపేస్తున్నా మంథని రెవెన్యూ ఉన్నత స్థాయి అధికారుల తీరు పైన గత రెండేళ్లలో జరిగిన భూ మ్యూటేషన్ల,పట్టా మార్పుల పైన సమగ్ర ఆడిట్ చేయాలని...ఖానాపూర్ భూవివాదంపై జిల్లా యంత్రాంగం పూర్తి విచారణ జరిపి ఖానాపూర్ భూ సస్పెండ్ చేయాలని లేని పక్షంలో ఈ భూ వివాదం పై రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రటరీ, తెలంగాణ ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఏల్పుల సురేష్,వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాబు రవి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి పట్టణంలోని అయ్యప్ప ఆలయం చౌరస్తాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.లారీ టిప్పర్ ఢీ కొట్టిన ఘటనలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పెద్దపల్లి పట్టణం కొంతం వాడకు చెందిన వరాల కొమురయ్య (60) వ్యవసాయ పనుల నిమిత్తం ఆదివారం మధ్యాహ్నం సమయంలో హీరో హోండా ( ఏపీ 15 ఏడి 628) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అయ్యప్ప స్వామి ఆలయం చౌరస్తా వద్ద పెద్దపల్లి వైపు వస్తున్న లారీ టిప్పర్ (టీఎస్ 04 3681) అతివేగంతో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వరాల కొమురయ్య కింద పడిపోగా టిప్పర్ వెనుక టైర్ కొమురయ్య తలపై నుండి వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమా చారం అందుకున్న పెద్దపల్లి ఎస్సై కే. నరేష్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకొని కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి,ప్రమాదానికి కారకుడైన టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉండగా టిప్పర్ ను పోలీస్ స్టేషన్ కుతరలించారు.కాగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మృతుని బంధువుల రోదనలు మిన్నంటాయి.

## పల్స్ పోలియో చుక్కలు ప్రతి చిన్నారికి అందించాలి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీపై ప్రభుత్వం సామాన్య ప్రజలకు తెలిసేలా కనీస ప్రచారం చేయలేదని, పోలియో కేంద్రాల్లో ఫ్లెక్సీలను కూడా ఏర్పాటు చేయలేదని యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బొడ్డు రాజేష్ ఆరోపించారు.ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలో అందించాల్సిన పోలియో చుక్కల మందు జూన్ మాసంలో అందించడం ఏంటని, అంగన్వాడి టీచర్లు ఎస్ ఐ ఆర్ సర్వేలో ఉన్నందున పోలియో కేంద్రాలను తగ్గించారని, ఆదివారం చేపట్టిన పోలియో కార్యక్రమం తూ తూ అంతరంగా కొనసాగిందని అన్నా రు. చిన్న చిన్న గ్రామాల్లో తండాల్లో నివసించే ప్రజలకు సమాచారం లేకపోవడంతో తక్కువ సంఖ్యలో చిన్నారులకు పోలియో చుకక్లు అందించారని, ప్రతి ఒక్క చిన్నారికి చుక క్ల మందులు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రజలకు లయన్స్ క్లబ్ ప్రత్యేక సేవా పిలుపు

### పపంచ చరిత్ర సృష్టించేందుకు సన్నాహాలు



**ప్రజాపక్షం/రామగిరి :** లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320G ఆధ్వర్యంలో లయనిస్టిక్ సంవత్సరం 202627 ప్రారంభాన్ని పురస్కరించుకుని జిల్లాలోని 86 లయన్స్ క్లబ్ ల ఆధ్వర్యంలో జూలై 1న ఒకే రోజు 1000కు పైగా సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రపంచ చరిత్ర సృష్టించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మహత్తర సేవా యజ్ఞం లో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ప్రజల కోసం ప్రత్యేక సేవా పోటీలను నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు లయన్. డా. శరణ్య మారుతి యాదవ్ తెలిపారు.ఈ పోటీల్లో లయన్స్ సభ్యులు మాత్రమే కాకుండా గ్రామంలోని ప్రతి పౌరుడు, యువకుడు, మహిళ, విద్యార్థి, రైతు, ఉద్యోగి, వ్యాపారవేత్త మరియు సామాజిక సేవ చేయాలనే ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు. పాల్గొనే వారు మొక్కల నాటకం, ఆకలితో ఉన్న వారికి భోజనం అందించడం, పక్షులకు నీటి పాత్రల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల పరిశుభ్రత, వృద్ధులకు సహాయం, పేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ, ప్లాస్టిక్ రహిత గ్రామ కార్యక్రమాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు వంటి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి వాటి ఫోటోలు, వివరాలను వాట్సాప్ నంబర్ 9014255745 కు పంపాలని కోరారు.అత్యుత్తమ సేవా కార్యక్రమాలు నిర్వహించిన వ్యక్తులు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు మరియు గ్రామాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బహుమతులు, ప్రశంసాపత్రాలు మరియు ఘన సన్మానం చేయనున్నట్లు తెలిపారు. మీరు నాటిన ఒక మొక్క రేపటి తరానికి నీడ ఇస్తుంది.మీరు చేసిన ఒక చిన్న మంచి పని సమాజంలో పెద్ద మార్పుకు నాంది కావచ్చు.సేవ చేయడానికి డబ్బు అవసరం లేదు.మంచి మనసు ఉంటే చాలు అని పిలుపునిచ్చారు.అలాగే, ప్రతి ఇంటి నుంచి ఒక సేవ – ప్రతి గ్రామం నుంచి ఒక ఆదర్శం యజ్ఞంలో భాగస్వాములు కావాలని కోరారు.

## గడువులోగా ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి

### తహశీల్దార్ నిజామొద్దీన్



**ప్రజాపక్షం /పెగడపల్లి :** మండలంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న SIR (సర్) కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎన్యూమరేషన్ ఫార్మ్స్ పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు ముమ్మరంగా నిర్వహించారు.ఈ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు తహశీల్దార్ సయ్యద్ నిజామొద్దీన్,ఆర్ ఐ జమునతో కలిసి పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. మండల పరిధిలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 268, 260, 259 మరియు 255 లను వారు స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడి ఫార్మ్స్ పంపిణీ సరళిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ.. ఎన్యూమరేషన్ ఫార్మ్స్ పంపిణీలో ఎలాంటి అలసత్వం వహించకుండా, ప్రతి ఒక్క సిబ్బంది బాధ్యతగా ఇంటింటికీ వెళ్లి స్వయంగా అందజేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ క్షేత్ర స్థాయి పరిశీలన కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు సంధి రాజమణి మల్లారెడ్డి, ధనాల రజిత సురేష్, మేకల అంజమ్మ మల్లయ్యలతో పాటు జీపీఓలు, బీఎల్ఓలు, ఇతర గ్రామ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ గ్రేటర్ మెట్‌పల్లి ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ సేవా కార్యక్రమం



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** వాసవి క్లబ్ గ్రేటర్ మెట్‌పల్లి ఆధ్వర్యంలో ఆదివారం డాన్ టు డస్క్ సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరపేట శివాలయంలో భక్తులు కూర్చునేందుకు రెండు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. అలాగే గోశాలలో ఆవులు ఎల్లప్పుడూ నీరు తాగేందుకు సిమెంట్ నీటి కుండీలను అందజేశారు.అదేవిధంగా అత్యవసర సంప్రదింపు (ఎమర్జెన్సీ కాంటాక్ట్) నంబర్ల జాబితా,రక్తదాతల (బ్లడ్ డోనర్స్) జాబితాను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతిభ కనబరిచిన మెరిట్ విద్యార్థులను ఘనంగా సన్మానించారు.ప్రజలకు ఉపయోగపడేలా స్వాగత బోర్డు (వెల్కమ్ బోర్డు)ను కూడా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు, వాసవి క్లబ్ గ్రేటర్ మెట్‌పల్లి అధ్యక్షుడు కొండూరి రాజేష్, జోన్ చైర్మన్ కోట కిరణ్ కుమార్, కార్యదర్శి గుండా శివ, కోశాధికారి కోటగిరి సంతోష్, ఎల్మి రవి, చిటిమెల్ల శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ఐదు సంవత్సరాలలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని ఆయా గ్రామాల సర్పంచులు ప్రజా ప్రతినిధులు అన్నారు.ఆదివారం మల్లాపూర్ నడికూడా గుండంపల్లి గ్రామాలతో పాటు ఆయా గ్రామాలలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని గ్రామాల సర్పంచులు ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు అందించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిని వాహిని,సర్పంచులు చిట్యాల లక్ష్మణ్ తూర్పు సమత రాజన్న డప్పుల పద్మ నరసయ్య, మల్లాపూర్ ఉపసర్పంచ్ గడ్డం సోమారెడ్డి, వార్డు సభ్యులు ముస్కేరి రమేష్,ముత్యాల గంగారాజం, శేఖర్,అల్లే లతా చంద్రయ్య, సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు,ఆశ కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు ఉన్నారు.

### ఇబ్రహీంపట్నంలో

**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయా గ్రామ సర్పంచులు వైద్య సిబ్బందితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద స్థానిక సర్పంచ్ బద్దం గోపి, ఉపసర్పంచ్ నాంపల్లి రమేష్,విండో చైర్మన్ జిల్లాల పవన్ తో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ వనజ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వనజ మాట్లాడుతూ మండలంలోని 0.5, సంవత్సరాల లోపు చిన్నారులకు చిన్నారులకు సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తామని ఆమె వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, వైద్యాధికారులు హెచ్ ఈ రమణ,సిహెచ్ఓ విజయ భాస్కర్,సూపర్వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్,వైద్య సిబ్బంది,ఏఎన్ఎంలు అంగన్వాడి టీచర్లు ఆశా కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## ధర్మసాగర్ కాలనీ నిరుపేదలకు త్వరలో ఇళ్ల పట్టాలు



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ధర్మసాగర్ కాలనీ వాసులు రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్,కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగ్‌రావును ఆదివారం కలిసి ఇళ్ల పట్టాల అంశంపై వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లామని, పట్టాలు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు.అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం త్వరలో ఇబ్రహీంపట్నానికి వచ్చి లబ్ధిదారులకు స్వయంగా పట్టాలు అందజేస్తానని హామీ ఇవ్వడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, నాయకులు మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్, సుగుణ కర్ రావు,ధర్మసాగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఇటిక్యాలలో ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

## పాల్గొన్న బి ఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి

**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాల పండుగ ఆదివారం డప్పు చప్పుల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది.ఈ బోనాల పండుగలో మాజీ మంత్రి,బిఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ తాటిపర్తి జీవన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూముదిరాజుల ఆరాధ్య దైవం పెద్దమ్మతల్లి అని అన్నారు.ఇటిక్యాల గ్రామంలో ముదిరాజ్ సోదరులు ఆడబిడ్డలకు అందరికీ కూడా బోనాలు తీసి ఆ పెద్దమ్మ తల్లి ఆశీర్వచన కొరకు ఆరాధించడం చాలా బాగుందని అన్నారు ముదిరాజులతో పాటుగా సమాజంలో అందరం కూడా పెద్దమ్మతల్లి అందరికీ ఆత్మవిశ్వాసం ఆత్మ ధైర్యం నింపేది ఆ పెద్దమ్మతల్లీ అని అన్నారు. జీవితమంతా ఆడ మగ అందరూ కూడా కాయకష్టం తోని పొలాలు కాయకూరలు ఉత్పత్తి చేయడం వాటిని విక్రయింప చేయడం ద్వారా వారు ఉపాధి పొందుతుంటారన్నారు.సోదరులకు ప్రభుత్వ పరంగా కల్పించవలిసిన సంక్షేమ కార్యక్రమాలు కల్పింపచేయడానికి కృషి చేయవలసిన బాధ్యత అందరిపై ఉంటుందని అన్నారు.ఒక విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగి ఉన్న వారు ముదిరాజ్ సోదరులు ఇటువంటి ముదిరాజ్ సోదరులకు ప్రభుత్వపరంగా విద్యా ఉద్యోగాలలో వారికి ఆశించిన మేరకు అవకాశాలు లభించకపోవడం బాధాకరమన్నారు.గతంలో ముదిరాజ్ సోదర వర్గాన్ని బీసీఏలో కలిపినట్టయితే వారికి మెరుగైనటువంటి విద్య ఉపాధి అవకాశాలు లభించబడతాయని భావించి ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఉండగా బీసీ ఏ లో కలిపే విధంగా నిర్ణయం చేశారని తదుపరి అది న్యాయస్థానంలో నిలిచిపోవడం అమలుకు నోచుకోలేకపోవడం బాధాకరమన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తదుపరి కేసీఆర్ బలహీన వర్గాల సంక్షేమం కాంక్షించి కులవృత్తులను ప్రోత్సహించే విధంగా ఏ కులవృత్తి అయిన వృత్తిపై వారికే హక్కులు కల్పింప చేయబడే విధంగా ప్రభుత్వపరంగా చర్యలు చేపట్టడం వారికి తోడ్పడడం గమనిస్తున్నామని తెలిపారు.

భవిష్యత్తులో సామాజికంగా వెనుకబాటు గురవుతున్నటువంటి బలహీన వర్గాలకు వాళ్లందరికీ వారి కులవృత్తులు ప్రోత్సహింప చేయడం ప్రజా ప్రతినిధుల బాధ్యతగా భావించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.పెద్దమ్మ తల్లి దీవెనలు యావత్ సమాజంపై ఉండాలి అని కోరుతున్నాను.

# పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం

**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ పట్టణం తోపాటు మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. ఆదివారం ఉదయం 7:30 నుండి సాయంత్రం 5:30 వరకు ఇప్పుడే పుట్టిన పాప నుండి 5 సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగింది.రాయికల్ పట్టణంలో నాలుగు చోట్ల పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రాయికల్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో తహసిల్దార్ నాగార్జున,మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు.రాయికల్ పట్టణ వైస్ చైర్ పర్సన్ తురగ సౌజన్య చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగింది.అల్లిపూర్ గ్రామంలో వార్డు సభ్యుడు హనుమల్ల రాజ్ కుమార్ పోలియో కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు.

### మోర్తాడ్‌లో

**ప్రజాపక్షం/మోర్తాడ్:** గ్రామ చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఆదివారం రోజు నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో రెండు పల్స్ పోలీయో కేంద్రాలను సర్పంచ్ పుప్పాల నరేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చేతుల మీదుగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసి వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరేష్ మాట్లాడుతూ.. పోలియో రహిత భారతదేశ నిర్మాణంలో మనమందరం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్య్రక్రమంలో ఉప సర్పంచ్ సదానంద గౌడ్, వార్డ్ మెంబర్ ప్రదీప్, డాక్టర్ శ్రీలేఖ, ప్రజాప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ధర్మపురి :** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ఆధ్వర్యంలో జులై 2న హైదరాబాద్ లో జరుగనున్న తెలంగాణ ఉద్య మకారుల భూ పోరాట సభ పోస్టర్ ను ఆదివారం నాయకులు ఆవిష్కరించారు. తెలంగాణ రక్షణ సేన ధర్మపురి నియోజకవర్గ ఇంచార్జి చల్ల రవి, కోస్న అనంత్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు భోగే పద్మ తదితరులు పోస్టర్ ను విడుదల చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవితక్క ఆధ్వర్యంలో భారీగా తరలి రావాలని కోరారు.కార్యక్రమంలో పోతు కనకయ్య, దుస్స రవీందర్, సయ్యద్ లక్ష్మి, శ్రీధర్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

# అంబేద్కర్ విజయం ప్రతి భారతీయుడికి ఆదర్శప్రాయం



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో సామాజిక సేవా కార్యకర్తలు గంగాధర మధుసూదన్, శాతల్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న "డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నామస్మరణ" కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భీమ్ రాజుపల్లి సర్పంచ్ కొలగాని శ్రీలత గంగ చారి పాల్గొని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీలత గంగాచారి మాట్లాడుతూ భారతదేశానికి సమగ్రమైన రాజ్యాంగాన్ని అందించడంలో అంబేద్కర్ ప్రధాన పాత్ర పోషించారని ప్రతి పౌరుడికి సమాన హక్కులు,ప్రాథమిక హక్కులు కల్పించారని ఆయన కృషి విజయం ప్రతి భారతీయుడికి ఆదర్శప్రాయం అని అన్నారు.అనగారిన వెనుకబడిన వర్గాలకు రాజకీయ సామాజిక ఆర్థిక హక్కులు కల్పించేందుకు అంబేద్కర్ జీవితాంతం పోరాటం చేశారని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి రక్షణ కవచమని దానిని పరిరక్షించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు.అనంతరం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న అంబేద్కర్ నామస్మరణ కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం నింపుతున్న నిర్వాహకులను వారు అభినందించారు.ఈ కార్యక్రమం లో నక్క అశోక్, తెలంగాణా అంబేద్కర్ సంఘం ధర్మపురి నియోజకవర్గం అధ్యక్షులు చెవులమద్ది మల్లేష్,గొల్లపల్లి వెంకటేష్, బోనగిరి నాగరాజు,చెవులమద్ది రమేష్, చందు,చంద్రయ్య, శాతల్ల మహేష్,కొండయ్య, ఆనంద్, పాల్గొన్నారు.

# వార్డు సమస్యల పరిష్కారానికి హామీ

## డ్రైనేజీ సమస్యలను పరిశీలించి



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని 3వ వార్డులో ఆదివారం మున్సిపల్ అధికారులు,ప్రజాప్రతినిధులు పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. వెల్మ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ ల తో కలిసి వార్డులోని పలు ప్రాంతాలను సందర్శించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ సమస్యల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను 3వ వార్డు కౌన్సిలర్ బత్తుల నరేష్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను వివరించి,వీలైనంత త్వరగా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు, వార్డులోని డ్రైనేజీ సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.ఈ పర్యటనలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కౌన్సిలర్ మాసుల ప్రవీణ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వార్డు ప్రజలు, పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి ప్రతి బిఎల్ఏ క్షేత్రస్థాయిలో పనిచేయాలి

## మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి బి ఎల్ ఏ క్షేత్రస్థాయిలో పనిచేయాలని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ పై అవగాహన కలిగి ఉండాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు.ఆదివారం రోజున పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్ బిఎల్ఏలతో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ సర్ కార్యక్రమంపై పూర్తి అవగాహన పెంచుకొని ఓటర్లకు సహకరించాలన్నారు. సర్ ప్రక్రియ నియమ నిబంధనలను వివరించారు.అనంతరం బిఎల్ఏలకు పార్టీ పరమైన గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. బిఎల్ఏలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు సరైన సమాచారం అందించాలన్నారు. ప్రజల సందేహాలను నివృత్తి చేస్తూ కార్యక్రమం అమలులో పారదర్శకతకు సహకరించాలని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అదేవిధంగా పార్టీ బలోపేతానికి ప్రతి బిఎల్ఏక్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని, ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూనెటి సంపత్ యాదవ్, మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, మండల అధ్యక్షులు మార్క్ లక్ష్మణ్, ఐరెడ్డి వెంకటరెడ్డి, రామ్ రెడ్డి, నాయకులు బాయిని రాజమల్లు, దేవయ్య, సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు పారుపల్లి గుణపతి, సర్పంచులు కుమారి, మచ్చ యాదగిరి అరుణ,పటాకుల అనుష అనీల్, బిఎల్ఏ లు పాల్గొన్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ పుల్ల సాయగౌడ్

ప్రజాపక్షం /మెట్‌పల్లి మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పుల్ల సాయగౌడ్ ప్రారంభించారు.గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రజలందరూ పల్స్ పోలియో కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నవజాత శిశువుల నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు,గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఏఎన్ఎం లావణ్య, ఆశా వర్కర్ లావణ్య, ఆరోగ్య సిబ్బంది,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కోనరావుపేటలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించిన

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి మండలంలోని కోనరావుపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మారు గంగారెడ్డి, ఉపసర్పంచ్ జక్కని పరందాములు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రి సహకరించాలని, జననం నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శ్వేత, ఆశా వర్కర్లు భాగ్యలక్ష్మి ,అనూష,మారుపాక గంగాధర్, గ్రామపంచాయతీ సిబ్బంది,ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# విలేకరి జంగం విజయ్‌ను పరామర్శించిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణానికి చెందిన విలేకరి, మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా ఉపాధ్యక్షుడు జంగం విజయ్‌కు ఇటీవల చేతికి గాయమై శస్త్రచికిత్స జరగడంతో ఆదివారం ఆయన నివాసానికి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా జంగం విజయ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న వారు, త్వరగా కోలుకుని తిరిగి యథావిధిగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలు పాటిస్తూ విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మాసుల ప్రవీణ్, బత్తుల నరేష్, ఖాజా అజీమొద్దీన్, నాయకులు ముఖీం, జెట్టి లక్ష్మణ్ ,తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలకేంద్రంలో ప్రధాన రహదారిపై చాలా రోజులుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న మురికి కాలువ సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టినట్లు పిట్లం సర్పంచు కుమ్మరి చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో భాగంగా చేపడుతున్న మురికి కాలువ పనులను ఆయన పరిశీలించారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్యం, సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ పనుల పరిశీలనలో సర్పంచు వెంట ఉపసర్పంచు అవేజ్‌బేగ్, స్థానిక నాయకులు ఉన్నారు.

## బంజపల్లిలో పల్స్‌పోలియో కార్యక్రమం



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ మండలంలోని బంజపల్లి గ్రామపంచాయతీలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. గ్రామసర్పంచు ఏలే సుగుణమ్మ చిన్నారులకు పోలియోచుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలియో రహిత సమాజ నిర్మాణం ప్రతీ ఒక్కరి భాధ్యత అన్నారు. 5 సంవత్సరాల లోపు చిన్నారులందరికి తప్పకుండా పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేయాలని తల్లితండ్రులకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో గ్రామప్రజా ప్రతినిదులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, పాల్గొన్నారు.

## పిట్లంలో విజయవంతమైన పల్స్ పోలియో

**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండలకేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. ఇందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచులు పాల్గొని చిన్నారులకు పోలియోచుక్కలు వేసి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని హస్నాపూర్‌లో సర్పంచు గొల్ల లావణ్య, చిన్నకొడప్గల్‌లో సర్పంచు రెడ్డి కిరణ్, కంభాపూర్‌లో సర్పంచు సుజాత, పిట్లం మండలకేంద్రంలోని ప్రభుత్వ 30 పడకల ఆసుపత్రిలో వైద్యురాలు శుభాంగి చిన్నారులకు పోలియోచుక్కలు వేశారు. అంతేకాకుండా గ్రామాల్లో, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ఆయాలు పాల్గొని వాడ వాడలా పల్స్‌పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి చిన్నారులకు పోలియోచుక్కలు వేశారు.



## జులై 8న సింగరేణి పాలిటెక్నిక్‌లో స్పాట్ కౌన్సెలింగ్

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్:** సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో కేటాయించిన ప్రత్యేక కోటా సీట్ల భర్తీకి జులై 8న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె రాజేందర్ తెలిపారు. జూన్ 11న నిర్వహించిన ప్రత్యేక కౌన్సెలింగ్ అనంతరం సివిల్ ఇంజనీరింగ్‌లో 22, కంప్యూటర్ సైన్స్‌లో 11, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో 7, మెకానికల్‌లో 21, మైనింగ్‌లో 23 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ కార్మికుల వారసుల కోసం కేటాయించిన ఈ సీట్ల భర్తీకి జులై 7 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి ఉద్యోగుల వారసులకు తొలి ప్రాధాన్యం ఇచ్చి, అనంతరం మిగిలిన సీట్లను ఇతర అర్హులైన విద్యార్థులతో భర్తీ చేస్తామని అన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు పాలిసెట్ ర్యాంక్ కార్డు, హాల్ టికెట్, పదో తరగతి మెమో, టీసీ, బోనాఫైడ్, కులం, ఈడబ్ల్యూఎస్, నివాస




ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, సింగరేణి ఉద్యోగి సర్వీస్ సర్టిఫికెట్, దరఖాస్తు కాపీ, ఫీజు రూ.20,000 నగదు, ఫొటోలతో పాటు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, నాలుగు సెట్ల జిరాక్స్ ప్రతులతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## జూన్ నెలాఖరులోపు పిఆర్‌సి ప్రకటించాలి

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** జూన్ నెలాఖరులోపు పిఆర్‌సి నివేదిక ఆధారంగా ఫిట్‌మెంట్ ప్రకటించి, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మి రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయ్ భవన్‌లో టిఎస్యూటిఎఫ్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మి రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల కుదింపు చర్యలను నిలిపివేసి, ప్రభుత్వ విద్యారంగం, ఉపాధ్యాయ సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సిపిఎస్ రద్దు, 317 జీవో బాధితులను సొంత జిల్లాలకు కేటాయించడం, పదోన్నతుల ద్వారా ఎంఈఓ, డిప్యూటీ ఇఓ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.




ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాంపల్లి ఉశన్న, ఇందురావు, లైశెట్టి ప్రీతి, రమేష్, రాజకమలాకర్ రెడ్డి, దుర్గయ్య, మహిపాల్, సమ్మయ్య, రోహిత్, త్రిమూకరావు, నగేష్, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

## బిఎల్ఎల సమావేశానికి తరలిన కాంగ్రెస్ నాయకులు

**ప్రజాపక్షం / జన్నారం :** నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న బూత్ లెవెల్ ఏజెంట్ల (బిఎల్ఏ) సమావేశానికి జన్నారం మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం, రాబోయే ఎన్నికల కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు నాయకులు తెలిపారు. ఓటరు జాబితా పరిశీలనతో పాటు ప్రజా సమస్యలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ఈ సమావేశం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అజ్మీర్ నందు నాయక్, జిల్లా కార్యదర్శి ముజఫర్ అలీ ఖాన్, పొనకల్ సహకార సంఘం చైర్మన్ అల్లం రవి,



టౌన్ అధ్యక్షుడు మంద రాజేష్, మహేశ్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## హజ్రత్ తాజుద్దీన్ బాబా ఉరుసు గోడపత్రిక విడుదల

**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాగజ్ నగర్ పట్టణంలోని తాజ్ నగర్ కాలనీలో జూలై 9న నిర్వహించనున్న హజ్రత్ తాజుద్దీన్ బాబా ఉరుసు ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికను ఆదివారం వారు విడుదల చేశారు. హజ్రత్ తాజుద్దీన్ బాబా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా జూలై 9న సందల్ ఊరేగింపుతో పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ ర్యాలీ తాజ్ నగర్ నుంచి ప్రారంభమై లారీ చౌరస్తా, రాజీవ్ గాంధీ చౌరస్తా, మెయిన్ మార్కెట్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా పట్టణ ప్రధాన రహదారుల్లో సాగుతుందని పేర్కొన్నారు. మల్నాస్, నియాజుద్దీన్, మొహద్ నజీర్



అలీ, సమీర్, మహమూద్ అలీ, సయ్యద్ జాకర్ అలీ సబ్రీ, సూఫీ అఫ్జల్ హుస్సేన్, అక్బర్ తాజీ, ఎం.ఎ. వసీం అహ్మద్, షబ్బీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి

**ప్రజాపక్షం / వాంకిడి :** చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని బంబార సర్పంచ్ బెండారే కృష్ణాజి అన్నారు. వాంకిడి మండలంలోని బంబార గ్రామంలో ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో వంటి ప్రమాదకరమైన వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలంటే ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రభుత్వం అందిస్తున్న



ఆరోగ్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జాడే సంతోష్, వార్డు సభ్యులు ఆకారపు శైలేష్, ఆశా వర్కర్ లక్ష్మి, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉట్నూర్ గ్రామ పంచాయతీలో పల్స్ పోలియో కార్యక్రమం



**ప్రజాపక్షం/ ఉట్నూర్:** పోలియో రహిత సమాజమే లక్ష్యంగా అందరూ ముందుకు వెళ్లాలని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అనిత శ్రీనివాస్ జాదవ్ పిలుపునిచ్చారు. ఉట్నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి ఐటీడీఏ పీఓ ముఖ్య అతిథిగా హాజరై, చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఒక్క చిన్నారి కూడా విస్మరణకు గురికాకుండా చూడాలని కోరారు. అందరి సహకారంతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మనోహర్, డాక్టర్ ప్రవీణ్, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్యమే దేశ భవిష్యత్తు

### అనుకుంటలో పల్స్ పోలియో



**ప్రజాపక్షం/మావల:** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా అనుకుంట ప్రభుత్వ పాఠశాలలో పోలియో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆరోగ్యవంతమైన బాల్యమే అభివృద్ధి చెందిన భారతదేశానికి బలమైన పునాది అని, పోలియో రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని సిబ్బంది పేర్కొన్నారు. గ్రామంలోని 5 సంవత్సరాల లోపు వయసున్న ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని, ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా చూడాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి నుంచి చిన్నారులను కేంద్రానికి తీసుకువచ్చి చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ వర్కర్ రాధ, అంగన్‌వాడి సిబ్బంది ప్రియాంక పాల్గొన్నారు.

## జగదాంబ దేవి ఆలయంలో చోరీ

**ప్రజాపక్షం/ నేరడిగొండ:** నేరడిగొండ మండలంలోని సవర్గం గ్రామంలో గల జగదంబ దేవి ఆలయంలో చోరి జరిగినట్లు ఆలయ పూజారి, స్థానికులు తెలిపారు. ఆలయం తలుపులు పగలగొట్టి హుండీతో పాటు దాదాపు రూ. 30 వేల నుండి రూ. 35 వేల వరకు కానుకల డబ్బులు, తులం వెండి, పుస్తెలతాడును దుండగులు ఎత్తుకెళ్లారని వివరించారు. చోరి విషయమై సర్పంచ్ జాదవ్ కళ్యాణి మహేందర్ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్సై ఇమ్రాన్ ఖాన్‌కు గ్రామస్తులతో కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదుపై పోలీసులు వెంటనే స్పందించి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌తో దర్యాప్తు చేస్తున్నట్లు జాదవ్ మహేందర్ పేర్కొన్నారు.



# శివాజీ స్ఫూర్తి తో యువత పని చేయాలి

ఆర్ఎస్ఎస్ జిల్లా సహకార్యవాహ్
సాయిమధుకర్ జీ



**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన రాయికల్ ఖండ యువ సాంఘిక కార్యక్రమం దేశభక్తి, సంస్కృతి పరిరక్షణ, జాతీయ చైతన్యానికి ప్రతీకగా ఘనంగా జరిగింది. రాయికల్ ఖండలోని వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో యువకులు గణవేష్‌లో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ప్రధాన వక్త ఆర్.ఎస్.ఎస్ జగిత్యాల జిల్లా సహకార్యవాహ్ సాయిమధుకర్ జీ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రను స్ఫూర్తిదాయకంగా వివరించారు.శివాజీ మహారాజ్ లేకుంటే హిందూసమాజమే ఉండేది కాదని,శివాజీ వందల కోటలు జయించి జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి రోజు హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించి గొప్ప వీరుడని ఆయన స్ఫూర్తి తో యువత పని చేయాలని అన్నారు. 1857 తొలి స్వాతంత్ర్య సంగ్రామం నుంచి అనేక మంది మహనీయులు చేసిన త్యాగాలు భారత జాతికి చిరస్థాయిగా నిలిచాయని తెలిపారు. ఝాన్సీ రాణి లక్ష్మీ బాయి మాతృభూమి కోసం చివరి శ్వాస వరకు పోరాడిన వీరవనిత అని అన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ ఆజాద్‌గానే జీవిస్తాను.,ఆజాద్‌గానే మరణిస్తాను అనే అచంచల దేశభక్తి సంకల్పం,వీర్ సావర్కర్ అండమాన్ సెల్యులార్ జైలులో అనుభవించిన అమానుష కష్టాలు దేశభక్తి ఎంత గొప్పదో నేటి యువతకు గుర్తు చేస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే 1857 భారతీయుల మొదటి స్వాతంత్ర్య సంగ్రామ ఉద్యమ సమయంలో గ్రామాల మధ్య రొట్టెలను పంపిణీ చేస్తూ రహస్య సమాచారాన్ని చేరవేసిన సంఘటనలను ప్రస్తావిస్తూ, దేశభక్తి కోసం ప్రజలు ఎంత చాతుర్యంతో, ఎంత సమన్వయంతో పనిచేశారో వివరించారు. డాక్టర్ హెడ్గేవార్ బాల్యం – ప్రతి యువకుడికి ఆదర్శంరాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ చిన్ననాటి నుంచే దేశభక్తిని జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారని వక్త తెలిపారు.బ్రిటిష్ రాణి పట్టాభిషేక సందర్భంగా పాఠశాలలో పంచిన మిఠాయిలను తిరస్కరించడం, వందే మాతరం నినాదాన్ని నిషేధించిన రోజుల్లోనే నిర్భయంగా ఆ నినాదం చేయడం వంటి సంఘటనలు ఆయన అచంచల దేశభక్తికి నిదర్శనమని చెప్పారు. శ్రీరాముడు – యువతకు శాశ్వత స్ఫూర్తిమర్యాద పురుషోత్తముడు శ్రీరాముడు ధర్మం, కర్తవ్యనిర్వహణ,త్యాగం,నాయకత్వానికి ప్రతిరూపమని, వ్యక్తిగత సుఖాల కంటే సమాజ శ్రేయస్సు, రాజధర్మాన్ని గొప్పగా భావించిన శ్రీరాముని జీవితం ప్రతి యువకుడు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. యువతకు పిలుపు భారతదేశం ఒకప్పుడు ప్రపంచానికి విశ్వగురువుగా, అపార సంపద కలిగిన దేశంగా నిలిచిందని, అయితే అంతర్గత విభేదాలు, ఐక్యత లోపం కారణంగా విదేశీ పాలనను ఎదుర్కోవాల్సి వచ్చిందని వక్తలు పేర్కొన్నారు. అలాంటి పరిస్థితులు మళ్లీ రాకుండా ఉండాలంటే యువత చరిత్రను తెలుసుకుని, సంస్కృతిని గౌరవించి, సమాజ సేవలో ముందుండి, దేశ ఐక్యతకు కట్టుబడి పని చేయాలని పిలుపునిచ్చారు. పాల్గొన్న యువకులు దేశం, సమాజం, సంస్కృతి పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సంకల్పం వ్యక్తం చేశారు. దేశం ముందు – స్వార్థం తరువాత అనే భావనతో ప్రతి యువకుడు ముందుకు సాగినప్పుడే భారతమాత వైభవం మరింత పెరుగుతుంది. సంఘటిత సమాజమే శక్తివంతమైన దేశానికి పునాది. మన చరిత్రను, ధర్మాన్ని గౌరవిద్దాం.,మన సనాతన సంస్కృతిని కాపాడుకుందాం.,సంఘ సమాజ కార్యంలో సమయమిచ్చి పని చేస్తూ దేశభక్తి నిర్మాణానికి,దేశాభివృద్ధికి మన వంతు సేవ అందిద్దాం అన్నారు.ఈ యువసాంఘిక్ కార్యక్రమంలో ఖండకార్యకారిణి, వివిధ గ్రామాల నుండి వచ్చిన 95 మంది స్వయంసేవకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో అభివృద్ధి కమిటీల పాత్ర కీలకం



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో నూతన గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎడిపెల్లి మురళి, సభ్యులను అర్బన్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుడ్ల రామకృష్ణ ఆదివారం శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధికి కమిటీ సభ్యులు సమిష్టిగా కృషి చేసి వేములకుర్తి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని, తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. కోశాధికారి అన్నరపు రాజారెడ్డి, సభ్యులు కుమ్మరిపెల్లి మల్లేశం, పట్నం నర్సయ్య, సిలివేరి మహేష్,అల్లెపు మహేష్, కారం ఇంద్రయ్య, బెల్లాల రాజం,రాధరపు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఓర్రెలో కాలు జారిపడి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని వెనుగుమట్ల గ్రామ శివారులో ప్రమాద వశాత్తు కాలుజారి ఒర్రె లో పడి ఓ వ్యక్తి మరణించాడు.స్థానిక ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 23న బుగ్గారం మండలం యశ్వంతరావు పేట గ్రామానికి చెందిన దూడ నరసయ్య (55) అనే వ్యక్తి బ్యాండ్ వాయించేందుకు వేణుగుమట్ల గ్రామానికి వెళ్లాడు.అక్కడ పని ముగించుకుని అదే రోజు సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో తన స్వగ్రామమైన యశ్వంతరావుపేటకు తిరిగి వస్తుండగా వెనుగుమట్ల గ్రామ శివారులోని ఒర్రె వద్ద ప్రమాదవశాత్తు కాలుజారి ఒర్రెలో పడిపోవడంతో మృతి చెందాడు.ఈ ఘటనపై మృతుని భార్య దూడ ఎల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లపల్లి ఎస్ఐ ఎం. కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

## వర్షాలు సమృద్ధిగా కురవాలని కప్పతల్లి ఆట

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** మండలంలోని అన్ని ప్రాంతాలలో వర్షం సమృద్ధిగా కురవాలని ఎండవేడిమితో ఉక్కపోతతో ప్రజలు నానా ఇబ్బందులు పడటంతో అక్కపల్లి గ్రామంలో కప్పతల్లి ఆటలు ఆడారు.అందరు ఆరోగ్యంతో ఉండాలని ఎవరుకూడ అనారోగ్యంతో ఉండకూడదని కోరుకున్నారు.వర్షాలు పడకుండా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని అన్నారు.పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ప్రభావం దేశమంతట చూపెడుతుందని మరి కొందరు చెబుతున్నారు.కప్పతల్లి ఆటలో అక్కపల్లి సర్పంచ్ మాదాసు శ్రవంతిబాబు,ఉపసర్పంచ్,గ్రామస్తులు ఉన్నారు.



## పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

మండల వైద్యాధికారి డాక్టర్ అమరేందర్ రావు

**ప్రజాపక్షం/ముత్తారం :** పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని,ఇందుకు ప్రతి ఒక్క తల్లిదండ్రులు సహకరించాలని మండల వైద్యాధికారి డాక్టర్ అమరేందర్ రావు పిలుపునిచ్చారు.ఆదివారం మండల వ్యాప్తంగా నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆయన పలు కేంద్రాలను సందర్శించారు.మచ్చుపేట పోలింగ్ బూత్ కేంద్రాన్ని సందర్శించిన ఆయన,పల్లె దవాఖాన ఇంచార్జ్ బొల్లం దీప్తితో కలిసి చిన్నారికి పోలియో చుక్కలు వేశారు.ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందికి పలు సూచనలు చేస్తూ..చిన్నారుల బెనిఫిసియరీ లిస్ట్‌ను వెరిఫై చేశారు. మండలంలో ఏ ఒక్క పిల్లాడు కూడా తప్పిపోకుండా 100% మందికి పోలియో చుక్కలు వేయాలని స్పష్టం చేశారు.మండలంలో ఏర్పాటు చేసిన మిగతా 13 పోలియో కేంద్రాలలో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొని చిన్నారులకు చుక్కలు వేశారు. ✻తొలి రోజు 1124 మందికి చుక్కల పంపిణీ:✻ మండలంలో 0 నుండి 5 ఏళ్ల లోపు చిన్నారులు మొత్తం 1136 మంది ఉండగా, తొలిరోజైన ఆదివారం 1124 మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి తెలిపారు. మిగిలిపోయిన వారికి సోమవారం సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ చుక్కలు వేస్తారని ఆయన పేర్కొన్నారు.పిల్లలకు సాధారణ టీకాలు వేయించినప్పటికీ, ప్రభుత్వం నిర్వహించే పల్స్ పోలియో తప్పనిసరిగా రెండు చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు.ఈ కార్యక్రమాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లలితారెడ్డి, పబ్లిక్ హెల్త్ నర్సులు కేసీమని,గ్రేసీ మని, సూపర్వైజర్ రమాదేవి, హెల్త్ అసిస్టెంట్లు ఎం. శ్రీనివాస్,పి.శ్రీనివాస్, స్టాఫ్ నర్సులు రవళి, ఝాన్సీ,ఫార్మసిస్ట్ రవీందర్,ఖమ్మంపల్లి ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఏఎన్ఎంలు స్రవంతి, సునీత,కళావతి,పుష్పలత,దుర్గమ్మ,శృతి,అంగన్‌వాడీ సిబ్బంది తో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## హైమాస్ లైట్ ప్రారంభం

**ప్రజాపక్షం / చొప్పదండి :** మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి పట్నాల సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిధుల నుంచి మంజూరు చేసిన హైమాస్ లైట్లను గ్రామ సర్పంచ్ లింగాల ఆనంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సహకారంతో రానున్న రోజుల్లో మరిన్ని పనులు చేపడతామని పేర్కొన్నారు.మండల అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్ష,ఉపాధ్యక్షులు గడుగు రాజేశం, మండల మల్లేశం, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కోలపురి శ్రీకాంత్, కులపెద్దలు మండల తిరుపతి, మండల మునీందర్, నిమ్మనవేని రాయమల్లు, నిమ్మనవేని నర్సయ్య, మండల రమేష్ పాల్గొన్నారు.

## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి

సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** అప్పుడే పుట్టిన శిశువు నుంచి 5 సంవత్సరాల వయసు గల ప్రతి చిన్నారి నిండు జీవితానికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగరంలోని బుట్టిరాజారాంకాలనీలో గల ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పోలియో రహిత రాష్ట్రంగా తెలంగాణను నిలపడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తల్లిదండ్రులు తప్పకుండా ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నిండుజీవితానికి రెండు చుక్కలు



**ప్రజాపక్షం/మాక్లూర్ :** పల్స్‌పోలియో లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్టాండ్‌లలో గ్రామసర్పంచ్, ఉపసర్పంచ్ ఆధ్వర్యంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది ప్రారంభించి గుంజలి ఉపసర్పంచ్ జింక్ సుమన్ మాట్లాడారు. పిల్లల ఆరోగ్యమే గ్రామ ప్రగతికి మూలమని పోలియో మహమ్మారిని దేశం నుండి తరిమికొట్టడానికి 05 లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రాణి, రేణుకా, ఆశావర్కర్లు మంజుల, సువర్ణ, శమంతక, సుహాసిని, ఆరోగ్య సిబ్బంది, వర్కర్లు పాల్గొన్నారు.

## తండ్రీ కొడుకులపై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల పరిధిలోని జన్నం గ్రామంలో అనుమానస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను ప్రశ్నించినందుకు ఓ యువకుడితో పాటు అతని తండ్రిపై దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జన్నం గ్రామానికి చెందిన దొడ్డి శ్రీనివాస్ కుమారుడు దొడ్డి విజయ్ కుమార్ ఈ నెల 26న రాత్రి గ్రామంలో బైక్‌పై అనుమానస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను నిలదీశాడు. దీంతో ఆగ్రహించిన ఆ ఇద్దరు వ్యక్తులు విజయ్ కుమార్‌ను కిందకు నెట్టేసి స్థానిక కల్లు దుకాణం యజమాని చేపూరి గౌడ్ వద్దకు వెళ్లారు. కల్లు దుకాణ యజమాని చేపూరి గౌడ్ విజయ్ కుమార్‌ను అడ్డుకొని, నా కష్టమర్లను అడగడానికి నువ్వు ఎవరివి ..? అంటూ బూతులు తిడుతూ దాడికి తెగబడ్డాడు. గమనించిన విజయ్ కుమార్ తండ్రి శ్రీనివాస్ గొడవను ఆపడానికి ప్రయత్నించగా అతనిపై కూడ దాడి చేసి చొక్కా చింపేశారు. బాధితుడు దొడ్డి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ధర్మారంలో వర్షాల కోసం గ్రామ దేవతలకు జలాభిషేకాలు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని ధర్మారం గ్రామంలో ఆదివారం గ్రామ దేవతలకు ఘనంగా జలాభిషేకాలు నిర్వహించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి, గ్రామం సుభిక్షంగా ఉండాలనే ఉద్దేశ్యంతో గ్రామస్థులంతా కలిసి ఈ ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఊరిలోని దేవతలకు ప్రత్యేక గంగా జలాభిషేకాలు, అర్చనలు చేసి వరుణ దేవుడు కరుణించాలని మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ సుందు కిషన్, ఉప సర్పంచ్ దినేష్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాజేశ్వర్ గౌడ్, గ్రామ నాయకులు శేఖర్, సాయిలు, భూమయ్య, యాదగిరి, అరుణ్, సంతోష్, ప్రసాద్, హరీష్, నితిన్, దప్పు రవి సాయి కుమార్, శ్రీకాంత్, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంగళ్‌పహాడ్, దుబ్బా తండాలలో ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని మంగళ్‌పహాడ్, దుబ్బాతండా గ్రామాలలో ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను తహసీల్దార్ దత్తాత్రి ఆదివారం పంపిణీ చేశారు. ఓటర్ల జాబితా సంస్కరణలు, నూతన ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దత్తాత్రి మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రతి ఒక్కరూ తమకు అందిన ఎన్యూమరేషన్ ఫారంని పూర్తిగా క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని కోరారు. ఫారంలో వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకొని అర్హులైన వారందరూ తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు గుర్తింపు కార్డుల్లో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఉండేందుకు ఈ ముందస్తు పరిశీలన ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిల్లా రామ్మోహన్, స్థానిక అధికారులు, బిఎల్ఓ లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పోలియో రహిత సమాజమే లక్ష్యం



**కెరమెరి :** కెరమెరి మండల కేంద్రంలోని బస్ స్టాండ్ ప్రాంతం, ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎస్ఐ సుధాకర్ ప్రారంభించారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఐదేళ్లలోపు చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తల్లి దండ్రులందరూ తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో చుక్కలు చిన్నారుల ఆరోగ్యవంతమైన జీవితానికి, బంగారు భవిష్య త్తుకు తోడ్పడుతాయని పేర్కొన్నారు. మండల పరిషత్ అభి వృద్ధి అధికారి అంజాద్ పాషా, ఉపాధి హామీ పథకం సహాయ నిధుల అధికారి మల్లయ్య, సర్పంచ్ పెందూర్ ఆనంద్ రావు, వైద్యాధికారి డాక్టర్ సయ్యద్ రియాన్, సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



**జైనూర్ :** జైనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, సర్పంచ్ కోడప ప్రకాశ్ ప్రారంభిం చారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ తల్లిదండ్రులు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని వారు పిలుపుని చ్చారు. జూన్ 28 నుంచి 30 వరకు మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. తొలిరోజు బూత్‌లలో, ఆ తర్వాత ఇంటింటికీ వెళ్లి టీకా అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కల పోలియో టీకా ఎంతో కీలకమని పవర్‌గూడా సర్పంచ్ తొడసం రాజేందర్ అన్నారు. ఆదివారం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్ వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్ర మాన్ని ఆయన ప్రారంభించారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నా రికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం తల్లిదం డ్రుల బాధ్యత అని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామంలో ఒక్క చిన్నారి కూడా మిగలకుండా పోలియో రహిత సమాజ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావాలని పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రజాప్రతిని ధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



**కాసిపేట :** పిల్లల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు ఎంతో అవసరమని కోనూరు సర్పంచ్ పేరం మల్లేష్ అన్నారు. జాతీయ పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా కాసిపేట మండలంలోని కోనూరు గ్రామపం చాయతీ పరిధిలో ఆదివారం పోలియో చుక్కల కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో చుక్కలు ప్రతి బిడ్డను జీవితాంతం రక్షిస్తాయని, ఇది అత్యంత సుర క్షితమైందని పేర్కొన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్ప నిసరిగా ఈ ఉచిత పోలియో చుక్కలను వేయించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రమాదేవి, ఆశా వర్కర్ శంక రమ్మ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



**వాంకిడి :** ప్రతి తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలంద రికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని రాంన గర్ 10వ వార్డు సభ్యురాలు మండోకర్ తూర్పుబాయ్ సూచించారు. వాంకిడి మండల కేంద్రంలోని రాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యురాలు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలియో రహిత సమాజ నిర్మాణా నికి ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



**జన్నారం :** ప్రతి తల్లిదండ్రులు సామాజిక బాధ్యతగా తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కొత్తపేట సర్పంచ్ దినేష్ నాయక్ సూచించారు. జన్నారం మండలంలోని కొత్తపేట గ్రామంలో పోలియో రహిత సమాజమే లక్ష్యంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్ర మాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ హాజరై ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎలాంటి అపోహ లకు తావివ్వకుండా పిల్లలందరినీ పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. పంచాయతీ కార్యదర్శి బీమ్ రావ్, ఆశా కార్యకర్త సుజాత, అంగన్వాడీ టీచర్ గంగామణి, పంచాయతీ సిబ్బంది రాజారావ్, నవీన్, గ్రామస్థులు పాల్గొన్నారు.



**వాంకిడి :** పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వాంకిడి గ్రామ సర్పంచ్ చూనార్కర్ సతీష్ అన్నారు. వాంకిడి మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమానికి ఆయన హాజరై ఐదేళ్లలోపు చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేయిం చడం ద్వారా వారిని ప్రమాదకరమైన వ్యాధి బారిన పడ కుండా కాపాడవచ్చని తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే ఆరోగ్య కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దీపక్ ముండే, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



**కమ్మర్‌పల్లి :** మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఆదివారం పల్సపోలియో కార్యక్రమం నిర్వహించామ న్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు వైద్యసిబ్బంది పోలియో చుక్కలు వేశారు. కమ్మర్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాల యంలో సర్పంచ్ కొత్తపల్లి హారిక అశోక్, కార్యక్రమాన్ని ప్రారంభించి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్ర మంలో ఉపసర్పంచ్ కొత్తపల్లి అశోక్, గ్రామశాఖ అధ్య క్షులు మల్యాల సుభాష్‌గౌడ్, గ్రామపంచాయతీ పాలక వర్గం, ఆశాసిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



**మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు అధికారులు తెలిపారు. మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మోర్తాడ్ ఆధ్వ ర్యంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఆది వారం ఉదయం పది గంటలకు మోర్తాడ్ బస్టాండ్‌లో నిర్వ హించిన పల్స్ పోలియో కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ పర్స దేవన్న, సెక్రెటరీ కస్ప లక్ష్మీ నర్సయ్య, ట్రెజరరీ తీ గెల రమేష్, మోర్తాడ్ గ్రామ సర్పంచ్ లయన్ బోగ ఆ నంద్, ప్రొగ్రాం ఛైర్మన్ ఉప సర్పంచ్ లయన్ సామ శ్రీనివా స్, డిస్ట్రిక్ ప్రెసిడెంట్ మామిడాల మనోహర్, దాడివే నవీ న్, కొప్పుల రాజశేఖర్, జైడి చిన్న గంగారాం, పబ్లిక్ హెల్త్ నర్స్ పద్మావతి, ఆశ వర్కర్ దండు సత్తెమ్మ, అంగన్‌వాడీ టీచర్ అంజమ్మ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



**నిజామాబాద్ :** ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని నిర్మాణానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ భుజంగరావు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దుబ్బ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రారంభించి చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో మేయర్ ఉమా రాణి,వైద్యాధికారిని రాజశ్రీ పాల్గొన్నారు.



**ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల పరిధిలోని 17గ్రామ పంచాయతీల్లో ఐదేళ్లలోపు చిన్నారులకు పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు ఈ కార్యక్ర మాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి వినీత్ రెడ్డి మాట్లాడుతూ.. మండ లంలో మొత్తం 3,400మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, మొదటి రోజు 3,196మంది చిన్నారులకు విజయవంతంగా వ్యాక్సిన్ వేశామన్నారు. ఈ కార్యక్రమం కోసం మండల వ్యాప్తంగా 8సబ్ సెంటర్లు, 27బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి బూత్‌లో నలుగురు సభ్యుల బృందం చొప్పున విధులు నిర్వహించి చిన్నారులకు చుక్కలు వేయడం జరి గిందని తెలిపారు. బస్టాండ్లు, ప్రధాన కూడళ్లలోని ట్రాన్సిట్ కేంద్రాలలో అనుకున్న స్థాయిలో చిన్నారులు రాకపోవడంతో అక్కడ ఆశించిన మేర స్పందన లభించలే దని తెలిపారు. మిగిలిపోయిన చిన్నారుల కోసం రాబోయే రోజుల్లో సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలీయో చుక్కలు వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల సర్పం చులు, ఉప సర్పంచులు, పాలకవర్గ సభ్యులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, హెల్త్ సూపర్ వైజర్లు, ఎఎన్ ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



**సారంగాపూర్ :** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం లోని ఆయా గ్రామాలతో పాటు పెంబట్ల గ్రామంలో ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆదివారం పల్స్ పోలియో కార్యక్ర మాన్ని సర్పంచ్ కొలపాక రాధ రాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొలపాక రాధ రాజు మాట్లా డుతూ పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలంటే ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఐదేళ్లలోపు పిల్లలకు సమీ పంలోని పోలీయో కేంద్రాలకు తీసుకువచ్చి చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రభా కర్, ఎంఎల్‌హెచ్‌పి సంపూర్ణ, ఏఎన్ఎం నిర్మల, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

**ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆదివారం ఉత్సాహంగా ఆయా గ్రామాల్లోని సర్పంచులు ఆరోగ్య సిబ్బందితో కలిసి ప్రారంభించారు.ఆయా గ్రామా ల్లోని జీరో నుండి ఐదేళ్లలోపు చిన్నారులకు సర్పంచులు ఆరోగ్య సిబ్బందితో కలిసి పోలియో చుక్కలు వేశారు.సర్పంచులు, ఏఎన్ఎంలు,అంగన్వాడీ,ఆశా కార్య కర్తలు చుక్కల పంపిణీని దగ్గరుండి పర్యవేక్షించారు.



## జులై 5 లోగా రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

గొల్లపల్లి పిఎసిఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాపక్షం/కొండాపూర్‌: కొండాపూర్ మండలంలో కొత్తగా పట్టాదారు పుస్తకం పొందిన రైతులు 5 తేదిలోగా రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని గొల్లపల్లి పిఎసి ఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. దరఖాస్తు ఫారం తో పాటు భూమి పట్టా పాసు పుస్తకం ,ఆధార్‌కార్డు ,బ్యాంకు ఖాత వివరాలు జత చేసి తమ క్లస్టర్ పరిధిలోని రైతు వేదికలో సమర్పించాలని తెలిపారు.

## ఈ నెల 30 రేపు రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలలు బంద్

జిల్లా బిసి వెల్ఫేర్ యూత్ అధ్యక్షులు ఎల్ అభిలాష్, గౌడ్

ప్రజాపక్షం /జోగిపేట : రాష్ట్రంలో విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చేయి చూపిస్తుందని విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంట్, వేతన బకాయిలు చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జిల్లా బిసి వెల్ఫేర్ యూత్ అధ్యక్షులు ఎల్ అభిలాష్, గౌడ్ అన్నారు. అందోల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుకుంటుందని కళాశాల యాజమాన్యాల పై మొండి చేయి చూపిస్తూ విద్యార్థులకు అందాల్సిన మౌలిక వసతులు కల్పించడంలో ఈ ప్రభుత్వం విఫలమైందని ఇందుకు నిరసనగా ఈ నెల 30 న రాష్ట్ర వ్యాప్త బందుకు రాష్ట్ర నాయకులు ఆ కృష్ణయ్య ఆదేశానుసారం జిల్లావ్యాప్తంగా కళాశాలలో స్వచ్ఛందంగా బంధులో పాల్గొనాలని ఆయన కోరారు.

## రేణుక మాతా ప్రజలు అందరిని చల్లగా చూడమ్మ

ప్రజాపక్షం/కొల్చారం : రేణుకా మాతా కటాక్షంతో ప్రజలందరూ చల్లగా ఉండాలని మండల గౌడ సంఘం అధ్యక్షులు అప్పాజీ పల్లి సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని అంసానిపల్లి గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఆలయ పురోహితులు కిరణ్ కుమార్ శర్మ వేద మంత్రముల మధ్య ఉదయం లంద పూజ జోగు అదుగుట అనంతరం సాయంత్రం పోచమ్మకు బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షుని తో పాటు మాజీ సర్పంచ్ శ్రీధర్ గౌడ్, జర్నలిస్టులు రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్‌లను శాలువాలతో సత్కరించారు. ఈ నర్సాగౌడ్, వెంకట్ గౌడ్, చంద్రంగౌడ్ తదితరులు ఉన్నారు.

## మైసమ్మ అమ్మవారికి మున్సిపల్ చైర్మన్ ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/రామాయంపేట: రామాయంపేట పట్టణంలోని మైసమ్మ అమ్మవారిని మున్సిపల్ చైర్మెన్ గజవాడ లావణ్య నాగరాజు దంపతులు ఆదివారం దర్శించుకొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాయంపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. రామాయంపేట ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని అన్నారు. ఆలయ కమిటి చైర్మెన్‌కు ఘన స్వాగతం పలికి సన్మానించారు.

# పల్లె ప్రజలకు దేవుళ్ళు ఆర్ఎంపి, పిఎంపిలు

రాత్రి, పగలు తేడా లేకుండా వైద్య సేవలు

ప్రభుత్వం గుర్తిస్తే అందుబాటులో మరింత వైద్యం




ప్రజాపక్షం/నిజాంపేట్ /మెదక్ : గ్రామీణ ప్రాంతల్లో ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందిస్తూ ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారు. పల్లెల్లో ఎవరికైనా జ్వరం, జలుబు, కడుపునొప్పి లేదా ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ప్రజలకు ముందుగా గుర్తుకు వచ్చేది ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులే రాత్రి, పగలు అనే తేడా లేకుండా రోగులకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు. ప్రత్యేకించి కరోనా మహమ్మారి సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు వైద్య సేవలు అందించిన ఆర్ ఎంపీ పిఎంపీ ల సేవలను గ్రామస్తులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు. క్లిష్ట పరిస్థితుల్లో కూడా రోగులకు ధైర్యం చెబుతూ ప్రాథమిక చికిత్స అందించి, అవసరమైతే మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రులకు పంపించారు. ఆర్ ఎంపీ, పీఎంపీ వైద్యులకు గ్రామీణ ప్రజలతో ఆత్మీయ అనుబంధం ఉంటుంది. రోగుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఫీజుల విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తారు. ఫీజుల కంటే రోగి ఆరోగ్యం, ప్రాణరక్షణకే అధిక ప్రాధాన్యత ఇస్తూ సేవాభావంతో పనిచేస్తుంటారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఆర్ఎంపీ వైద్యులను ప్రభుత్వం గుర్తించి, తగిన శిక్షణ, సహాయ సహకారాలు, ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. వీరికి ప్రభుత్వం గుర్తింపు కల్పించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు మరింత మెరుగుపడే అవకాశం ఉందని పల్లె ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఓటు హక్కును అందరూ పరిరక్షించుకోవాలి

డిబిఎఫ్ మెదక్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



ప్రజాపక్షం/నిజాంపేట్ : సమగ్ర ఓటర్ ప్రత్యేక సవరన పేరుతో ఓటు హక్కును హరించే కుట్రలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని డాక్టర్ అంబేద్కర్ ఆలోచనలకు కట్టుబడి పోరాడాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి. శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన డీబీఎఫ్ మెదక్ జిల్లా 12వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఓటర్ జాబితా ప్రత్యేక సవరణలో ఎవరూ తమ ఓటు కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దళిత, బహుజనుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఎంపికైన విద్యార్థులకు వెంటనే ప్రవేశాలు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను ఖండించారు. దళిత ఉద్యోగుల నేత జెల్ల సుధాకర్ మాట్లాడుతూ డీబీఎఫ్ దళితుల హక్కుల సాధనకు అంకితభావంతో పనిచేస్తోందన్నారు. అనంతరం అనారోగ్యంతో మృతి చెందిన డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లకల్ నరసన్నకు సభలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సమావేశంలో దళిత నేతలు రామస్వామి, పాటల మల్లన్న, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మల్లేశం, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కల్లూరి సంజీవ్, ఆనంద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో డీబీఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షుడిగా దుబాసి సంజీవ్ మరోసారి ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా హనుమకొండ దయాసాగర్ ఎన్నికయ్యారు. కమిటీలో ప్రసాద్, సత్యం, ఇసాక్, నిరుడు నర్సింలు, ఎం నర్సింలు, చంద్రం కళ్యాణి

# ఏడుపాయల క్షేత్రంలో... కిక్కిరిసిన భక్తజనం

మొక్కులు చెల్లించుకున్న భక్తులు



ప్రజాపక్షం/పాపన్నపేట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గామాత క్షేత్రం ఆదివారం భక్తులతో జనసంద్రమైంది. దర్శనానికి గంటల తరబడి భక్తులు వేచి ఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు వారాంతపు సెలవు రోజు కావడంతో ఏడుపాయలకు భక్తులు పోటెత్తారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ అర్చకులు వేకువజామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించి భక్తులకు వనదుర్గమ్మ దర్శనం కల్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాలు, జంట నగరాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మ దర్శనానికి తరలివచ్చారు. చెక్ డ్యామ్, అమ్మవారి ప్రధాన ఆలయం ముందున్న మంజీరా నదీ పాయలో పుణ్యస్నానాలు ఆచరించి వనదుర్గాదేవి దర్శనానికి బారులు తీరారు. అమ్మ దర్శనంతో భక్తులు తన్మయత్వం చెందారు. పలువురు భక్తులు అమ్మవారికి డప్పు చప్పుల్ల మధ్య బోనాలు, ఒడి బియ్యం సమర్పించారు. మరికొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ఏడుపాయల వనదుర్గాదేవి క్షేత్రం హోరెత్తింది. చల్లంగా చూడమ్మా.. వనదుర్గమ్మ తల్లి.. అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. ఆలయ అర్చకులు పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

# లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ సెక్రటరీగా దేమె యాదగిరి



ప్రజాపక్షం/రామాయంపేట: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320డి డిస్ట్రిక్ట్ సెక్రటరిగా దేమె యాదగిరి నియమితులయ్యారు. ఆదివారం హైద్రాబాద్‌లోని నిమ్మల గార్డెన్స్‌లో నిర్వహించిన జిల్లా క్యాబినేట్ సమావేశంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ విజయలక్ష్మీ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈసందర్భంగా దేమె యాదగిరి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపడతానని తెలిపారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో బాగంగా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, తడిపొడి చెత్తను వేర్వేరుగా నిర్వహించే విదానంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, కాలుష్య నివారణకు చైతన్యం తీసుకురావడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. సమాజసేవే లక్ష్యంగా పర్యావరణ హిత కార్యక్రమాలు, పరిశుభ్రత ఉద్యమాలు ప్రజా చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తూ లయన్స్ క్లబ్ ప్రతిష్టను పెంచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన బాబురావు, అమర్నాత్‌తో పాటు లయన్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## అంకుషాపూర్ గ్రామస్తుడి దారుణ హత్య



ప్రజాపక్షం / జమ్మికుంట : జమ్మికుంట మండలం అంకుషాపూర్ గ్రామ సమీపంలో శనివారం అర్ధరాత్రి దారుణ హత్య జరిగింది. మృతుడు అంకుషాపూర్ గ్రామానికి చెందిన మొగిలిగా గుర్తించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మొగిలిని గొడ్డలితో దాడి చేసి హత్య చేసినట్లుగా భావిస్తున్నారు. హత్య జరిగిన విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని హత్యకు గల కారణాలు హత్య చేసిన వ్యక్తుల గురించి ఆరా తీశారు. హత్యకు గురైన మొగిలి మడిపల్లి గ్రామంలో పీర్ల ఉత్సవాలను తిలకించి అంకుషాపూర్ వెళ్తుండగా దారి కాసి హత్య చేసినట్లుగా తెలుస్తుంది. మృతుడు గతంలో జైలు జీవితం గడిపి ఇటీవల బెయిల్ పై వచ్చారు. హత్యకు సంబంధించిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తుంది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు జమ్మికుంట సిఐ రామకృష్ణగౌడ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. హత్య జరిగిన విషయం బయటకు పొక్కడంతో గ్రామంలో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు.

## కొత్తపల్లిలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలని మహిళల రాస్తారోకో




ప్రజాపక్షం / కొత్తపల్లి : కొత్తపల్లి మండల కేంద్రంలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపుటకు జూలై 2025లో రీజనల్ మేనేజర్ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ డ్రైవర్స్, కండక్టర్స్ బస్సులు ఆపడం లేదని కొత్తపల్లి మహిళలు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ వేముల కవిత చంద్రశేఖర్ మాట్లాడుతూ రీజనల్ మేనేజర్ ఆదేశాల మేరకు కొత్తపల్లిలో ఎక్స్‌ప్రెస్ బస్సులను తప్పనిసరిగా ఆపాలన్నారు. లేనిపక్షంలో కరీంనగర్ జగిత్యాల ప్రధాన రహదారిని స్తంభింపజేస్తామని అన్నారు. పోలీసులు సమస్యను పరిష్కరించేందుకు పై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు, గ్రామస్థులు రాస్తారోకో విరమించారు.

## పిడుగుపడి బాలుడి మృతి

ప్రజాపక్షం / కొత్తపల్లి : పిడుగు పడి బాలుడు మృతి చెందిన సంఘటన కొత్తపల్లి మండలంలోని మానేరు డ్యాంలో చోటు చేసుకుంది. కొత్తపల్లి సిఐ కోటేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ పట్టణంలోని గోదాంగడ్డ ప్రాంతానికి చెందిన పోతు ప్రణీత్ (11) తన తాతతో మేకలు కాసేందుకు మానేరు డ్యాంలోకి వెళ్లారు. సాయంత్రం మేకలు కాస్తుండగా దురదృష్టవశాత్తు బాలుడిపై పిడుగుపడగా చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు బాలుడు మృతి చెందారని తెలిపారు. తండ్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కోటేశ్వర్ తెలిపారు.

